పంట పొలాలు సమాధి


కంచికచర్ల మండలం మోగులూరులో ఇసుక మేట వేసిన వరిపొలాలు


పెనుగంచిప్రోలు మండలం ముచ్చింతాలలో పొలంలో మేట వేసిన ఇసుక


ముచ్చింతాలలో వరదలకు పంటదెబ్బతిని ఇసుక మేట వేసిన పొలాన్ని చూపిస్తున్న రైతు సత్యనారాయణ


కోతకు గుర్తె మట్టి, రాళ్లు మేట వేసిన పొలం


నందిగామ మండలం
కంచల గ్రామంలో ఇసుక మేట వేసిన పొలం

- వరదలకు ఇసుక మేట వేసిన పొలాలు
- ఆనవాళ్లు కూడా లేని పంటలు
- కోతకు గురైన పంట భూములు
- రైతులకు తీరని నష్టం
- ఇసుక మేటకు అందని నష్టపరిహారం

పెనుగంచిప్రోలు, కంచికచర్ల, నందిగామటౌన్, వీరులపాడు: ఈనెల ఆరంభంలో కురిసిన భారీ వర్షాలు, సంభవించిన వరదలకు మునేరు, పాలేరు తోపాటు వాగులు పొంగిపొర్లాయి. దీంతో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వందలాది ఎకరాల పంటపొలాల్లో ఇసుక మేట మేయడంతో పాటు పొలాలు కోతకు కూడా గురయ్యాయి. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లో 811 ఎకరాల్లో ఇసుక మేట వేయగా, 218ఎకరాల్లో భూములు కోతకు గురైనట్లు అధికారులు లెక్కతేల్చారు. నందిగామ వ్యవసాయ డివిజన్‌పరిధిలో 90 ఎకరాల్లో ఇసుక మేట వేయగా, పది ఎకరాలు కోతకు గురైనట్లు అధికారులు తమసర్వేలో గుర్తించారు. వరదలకు పంటపొలాలు దెబ్బతినడంతో నష్టం జరుగగా, ఇసుక మేటతోపాటు భూమి కోతకు గురికావడంతో ఆయా పొలాల రైతులకు


వీరులపాడు మండలం కొణతాలపల్లిలో ఇసుక మేట వేసిన పంటపొలం

మరింత నష్టం వాటిల్లింది.

జీవో ఇచ్చిన అందని పరిహారం...

వరదల కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వరికి ఎకరాకి రూ.10వేలు నష్టపరిహారం అందిస్తుండగా, మిరప తోటలకు ఎకరాకు రూ.35వేలను నష్టపరిహారంగా అందిస్తోంది. అయితే వరదల కారణంగా పంటలు దెబ్బతినడంతోపాటు ఇసుక మేట వేయడం, కోతకు గురైన పొలాల వివరాలను కూడా ఎన్యుమరేషన్ అధికారులు నమోదు చేశారు. అయితే ఈభూములకు సంబంధించి పంటనష్టానికి మాత్రమే బాధిత రైతులకు పరిహారం ఇస్తుండగా.. ఇసుక మేట, పంటభూమి కోతకు గురైనందుకు మాత్రం రైతులకు పరిహారం అందడంలేదు. ఇసుక మేట వేసిన పొలాలకు నష్టపరిహారంగా హెక్టారుకు రూ.18వేలు, వరదనీటి ఉధృతి కారణంగా కోతకు గురైన పొలాలకు హెక్టారుకు రూ.47వేలు పరిహారంగా అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆచరణలో మాత్రం ఆయా పొలాలకు కేవలం పంటనష్టాన్ని మాత్రమే అందిస్తున్నారని బాధితరైతులు వాపోతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి.

ఇసుక మేట వేసిన, కోతకు గురైన పొలాలను తిరిగి సాగుకు అనుకూలంగా మార్చుకునేందుకు ఎకరానికి ఎంత ఖర్చు అవుతుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు చెబుతున్నారు. మేట వేసిన ఇసుక, మట్టి, రాళ్లను రైతులు పొలంలో నుంచి బయటకు తోలుకునేందుకు ప్రభుత్వం మైనింగ్ అనుమతులు ఇస్తే కొంతవరకు రవాణా ఖర్చులు అయినా మిగులుతాయని రైతులు కోరుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పంటనష్టపరిహారంతోపాటు ఇసుక మేట, కోతకు గురైన పొలాలకు అందిస్తామన్న పరిహారాన్ని కూడా వెంటనే అందజేసి తమను ఆదుకోవాలని జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని బాధిత రైతులు కోరుతున్నారు.

ఇసుక మేట వేసింది...



అన్నవరం గ్రామంలో ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాను. రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టాను. వరద నీటికి పంట అంతా కొట్టుకుపోవటంతోపాటు పొలంలో ఇసుక మేట వేసి, రాళ్లు వచ్చాయి. మోటార్లు కొట్టుకుపోయాయి. పంటనష్టంతోపాటు మేట తొలగింపునకు పరిహారం ఇవ్వాలి.

– నాగేశ్వరరావు, కౌలు రైతు, అన్నవరం, జగ్గయ్యపేట మండలం

11 ఎకరాల్లో పంటనష్టం..



మునేరు ఆయకట్టున 11ఎకరాల్లో వరిసాగు చేయగా, వరదలకు పంటంతా పూర్తిగా కొట్టుకుపోయింది. పొలంలో ఇసుక మేట వేసింది. ఇప్పటికీ పొలంలో నీరు ప్రవహిస్తూనే ఉంది.పంట నష్టంతోపాటు ఇసుక మేట తీసుకునేందుకు ప్రభుత్వం సాయం అందజేసి ఆదుకోవాలి.

– మల్లెంపాటి సతీష్, రైతు, ముచ్చింతాల

కొనసాగుతున్న రీఎన్యూమరేషన్

కంచికచర్ల : మున్నేరు, కృష్ణానది పరివాహక గ్రామాలైన మండలంలోని కొత్తపేట, గనిఆత్కూరు, చెవిటికల్లు, మోగులూరు, మున్నలూరు, కునికెనపాడు, ఎస్.అమరవరం, పెండ్యాల, వేములపల్లి గ్రామాల్లో రీ ఎన్యుమరేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల సంభవించిన వరదలకు ఈ గ్రామాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇళ్లలోకి వస్తువులు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోవడంతో నష్టపోయారు. అయితే ఈ గ్రామాల ప్రజలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించని వైనంపై బాధితులకు న్యాయం చేయాలంటూ ఇటీవల 'సాక్షి' దినపత్రిక పలు కథనాలను ప్రచురించింది. దీంతో స్పందించిన పాలకులు, అధికారులు స్పందించారు. ముంపు గ్రామాల్లో శనివారం నుంచి రెవెన్యూ, పంచాయతీ అధికారులు పర్యటిస్తూ వరదనష్టం వివరాలను నమోదు కార్యక్రమం చేపట్టారు.


కంచికచర్ల మండలం
మోగులూరులో రీసర్వే చేస్తున్న వీఆర్వో శ్రీలక్ష్మి

ఈప్రక్రియ రెండోరోజు ఆదివారం కొనసాగుతోంది. సర్వే అధికారులు ఇంటింటికీ వెళ్లి బాధితుల వివరాలను నమోదు చేస్తున్నారు. వరదనష్టం నమోదును నిష్పక్షపాతంగా చేసి, బాధితులందరికీ పరిహారం అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తెస్తా

సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకువస్తానని ఆపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. మాజీ సీఎం, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఉంచిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేర్చుతానని ఆయన వివరించారు. జగ్గయ్యపేటలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో చేపట్టిన ఆయా అభివృద్ధి పనులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. రూ.కోటి వ్యయంతో తమ ప్రభుత్వ హయాంలో నిర్మించిన జగ్గయ్యపేట హైవే బస్టాండ్‌ను కూటమి ప్రభుత్వం ఏర్పడి 100రోజులు దాటినా వినియోగంలోకి తీసుకురాలేదన్నారు. టిడ్కో ఇళ్లను పూర్తిచేసి త్వరితగతిన పేదలకు అందజేయాలని కోరారు. వరదలకు పంటలు, ఇళ్లు దెబ్బతిని నష్టపోయిన బాధితులందరికీ పరిహారం అందించాల్సిన బాధ్యత రాష్ట్రప్రభుత్వంపై ఉందన్నారు. పంటనష్టం నమోదులో తమపేర్లు లేవని అనేకమంది రైతులు ఫిర్యాదు చేస్తున్నందున వెంటనే రీఎన్యుమరేషన్ చేసి బాధితులందరికీ న్యాయం చేయాలన్నారు. ఎన్నికల్లో వచ్చినా ఇచ్చిన హామీలను చిత్తశుద్ధిగా అమలుచేసిన ఘనత మాజీసీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను త్వరితగతిన అమలుచేయాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీడీపీ కూటమి 100రోజుల పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే తిరుపతి లడ్డూలో కల్తీ చోటుచేసుకుందంటూ సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరతీశారని విమర్శించారు. రాజకీయాల్లో అడుగుపెట్టాక ఇప్పటివరకు ఆరు సార్వత్రిక ఎన్నికల్లో పనిచేశానని, జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పరిస్థితులతోపాటు ఆయాసమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తాను నిత్యం అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ శ్రేణులను ఏకీకృతం చేసి నియోజకవర్గంలో గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. పదిరోజుల్లో పట్టణంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. నియోజకవర్గస్థాయిలో పార్టీనాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తానని వివరించారు.టీడీపీ కూటమి ఇచ్చిన హామీల అమలుతోపాటు ఆయా ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని అడుగడుగునా వైఎస్సార్‌సీపీ తరఫున నిలదీస్తామన్నారు. రైతులు, ప్రజల పక్షాన పోరాడతామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని టీడీపీ కూటమి ప్రభుత్వం అమలుచేయాలని డిమాండ్ చేశారు.

బూదవాడలో దెబ్బతిన్న ప్రభుత్వ భవనాలు




పాలేటి వరద ఉధృతికి దెబ్బతిన్న సచివాలయం, రైతుభరోసా కేంద్రం

బూదవాడ(జగ్గయ్యపేట): ఇటీవల వరదలకు పాలేరు ఉధృతంగా ప్రవహించడంతో బూదవాడలోని గ్రామసచివాలయం, రైతుభరోసా కేంద్రం, గోడౌన్లు దెబ్బతిన్నాయి. సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాల కిందభాగం కొట్టుకుపోవడంతో పిల్లర్‌లపైనే ఆధారపడి ఉన్నాయి. సచివాలయ కిటికీలు, షట్టర్‌లు కూడా నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి. రైతుగోడౌన్ కూడా దెబ్బతింది. అధికారులు స్పందించి ఆయా భవనాలకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


వరద ఉధృతికి దెబ్బతిన్న రైతుగోడౌన్ కిందిభాగం

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే



జగ్గయ్యపేట అర్బన్: ఇటీవల కురిసిన భారీవర్షాలు, సంభవించిన వరదలకు జగ్గయ్యపేట పట్టణంలోని ముంపునకు గురైన ధనంబోడుకాలనీ, దుర్గాపురం, విద్యానగర్ కాలనీల్లో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) ఆదివారం పర్యటించారు. ముంపునకు గురైన ప్రాంతాల్లో గ్రావెల్ ఏర్పాటుచేయాలని, రైల్వే అండర్ పాస్ కింద ఉన్న వరద నీటిని తొలగించాలని స్థానికులు ఎమ్మెల్యే తాతయ్యను కోరారు. అనంతరం ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ అండర్ పాస్ కింద ఉన్న వరద నీటిని తొలగించాలని రైల్వే అధికారులను, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మైనేని రాధా, మాజీ ఏఎంసీ చైర్మన్ కట్టా నరసింహారావు, పట్టణ తెలుగుయువత అధ్యక్షుడు వేదులాపురి సైదా, నాయకులు షేక్ అస్లాం, రహీం, జాని, జాఫర్, నంద, పాము బాబురావు పాల్గొన్నారు.

పత్తి రైతు దిగాలు

- వర్షాలకు రాలిన పూత, పిందె
- పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు

వత్సవాయి: తెల్లబంగారంగా పిలిచే పత్తిసాగు చేపట్టిన రైతులకు ఈ ఏడాది నష్టాలు తప్పేలా లేవు. ఈ నెల ప్రారంభంలో కురిసిన భారీవర్షాలకు పత్తి మొక్కకు వచ్చిన పూత, పిందె రాలిపోతుంది. దీంతో పత్తిపంట సాగుచేసిన రైతులకు నష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశాజనకంగా వర్షాలు పడడంతో రైతులు ముందస్తుగా పత్తిసాగు చేపట్టారు. సెప్టెంబర్ నెల ప్రారంభంలో సుమారు పది రోజులపాటు ఏడతెరపి లేకుండా పడిన వర్షాలకు పత్తి పంట పూర్తిగా దెబ్బతింది. వర్షాలకు భూమిలో తేమశాతం ఎక్కువై పూత, పిందె మొత్తం రాలిపోవడంతోపాటు మొక్కలు ఎదుగుదల లేక ఎర్రబారిపోతున్నాయి.

తగ్గనున్న దిగుబడులు..

పత్తి పంట దిగుబడులు గణనీయంగా తగ్గనున్నాయి. ప్రస్తుతం పంట ఉన్న పరిస్థితిని చూస్తే ఎకరానికి ఐదారు క్వింటాళ్ల లోపే దిగుబడులు వచ్చే అవకాశాలున్నట్లు రైతులు చెబుతున్నారు. ఏటా సెప్టెంబర్ నెల చివరికల్లా ఒకొక్క పత్తి మొక్కకు 30 నుంచి 50 కాయలు ఉండేవి. ఇప్పుడు పత్తి మొక్కకు పది కాయలు మించి లేవు. అవి కూడా వర్షాలకు నల్లబడి పాడైపోతున్నాయి. ఈ ఏడాది పత్తికి కూడా పెట్టుబడులు పెరిగిపోయాయి. ఎకరం పొలం కౌలు రూ.20 నుండి 25వేలు కాగా విత్తనాలు, పురుగుమందులు, మందుకట్టలు, కూలీలతో కలిపి మరో రూ.35వేలు ర్చవుతున్నాయి. ఎకరానికి ఐదు క్వింటాళ్ల దిగుబడి వేసుకున్న కౌలు కూడా వచ్చేటట్లు లేదని కౌలురైతులు వాపోతున్నారు.


వత్సవాయిలో ఎదుగుదల లేక ఎర్రబారి పూత రాలుతున్న పత్తి

13వేల ఎకరాల్లో పత్తి సాగు ...

వత్సవాయి మండలంలో 13వేల ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశారు. గత ఏడాది మిర్చిపంటలో వచ్చిన నష్టాలను చూసి పత్తిసాగు వైపు రైతులు మొగ్గుచూపారు. దీంతో పత్తిసాగు విస్తీర్ణం గతంలో పదివేల ఎకరాల్లో సాగవుతుండగా, ఈసారి మరో మూడువేల ఎకరాలు పెరిగింది. ఆమేర మిరప సాగు తగ్గింది. ఏటా రైతులు పత్తిలో వచ్చే ఆదాయాన్ని మిర్చి తోటలకు పెట్టుబడులకు ఉపయోగించేవారు. ఇప్పుడు పత్తి కూడా దెబ్బతినడంతో మిర్చి తోటల పెట్టుబడుల కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితిలు నెలకొన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.


శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేకాలంకరణలో పూజా మండపం

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు

జగ్గయ్యపేట అర్బన్ : నూటొక్క దేవాలయాల పట్టణంగా ప్రసిద్ధికెక్కిన జగ్గయ్యపేట పట్టణం ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పట్టణంలోని వందల ఏళ్లనాటి అతి పురాతన ఆలయాలతోపాటు ఇటీవల నిర్మించిన అనేక దేవాలయాలు ముస్తాబవుతున్నాయి. అక్టోబర్ 3వతేదీ నుంచి 12వ తేదీ దసరా పండుగ వరకు జరిగే ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఆయా ఆలయాల వద్ద పందిళ్లు వేస్తున్నారు. ఆలయాలను సుందరంగా ముస్తాబు చేస్తున్నారు.


అద్దాలబజారులో వెండి దేవాలయం వద్ద వేసిన పందిరి


దసరా ఉత్సవాలకు నకాశిబజారులో విద్యుత్ అలంకరణలో అమ్మవారి చిత్రం

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికక

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. ఆయా సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని వివరించారు.

కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



విజయవాడస్పోర్ట్స్: మేకల విజయసారథి మెమోరియల్ రెండో జాతీయ కరాటే పోటీల బ్రోచర్‌ను విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ వడోకై కరాటే డో అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త మేకల లక్ష్మీప్రసాద్ విచ్చేశారు. విశాఖపట్నంలో డిసెంబర్ 15 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోలా ప్రతాప్, జి.ఆనందబాబు తెలిపారు. పోటీలకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ సతీష్ వ్యవహరిస్తారని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జికి న్యాయవాదుల వినతి



జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని పెనుగంచిప్రోలు మండలాన్ని నందిగామ కోర్టు పరిధిలో కాకుండా జగ్గయ్యపేట కోర్టు పరిధిలోకి తీసుకురావాలని న్యాయవాదులు కోరారు. ఈమేరకు ఆదివారం జగ్గయ్యపేట కోర్టును పరిశీలించేందుకు వచ్చిన కృష్ణాజిల్లా ప్రధానన్యాయమూర్తి అరుణసారికను జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా సుందరరావు మాట్లాడుతూ పెనుగంచిప్రోలు మండలాన్ని జగ్గయ్యపేటకు మార్చాలని 48ఏళ్లుగా పోరాడుతున్నామన్నారు. అలాగే జగ్గయ్యపేటకు సబ్‌కోర్టును మంజూరు చేయాలని జిల్లా జడ్జికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, మురళి, దాసరి నాగేశ్వరరావు,ఎం.విజయకుమారి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సౌమ్య



నందిగామ టౌన్: ప్రజాసంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. మండలంలోని పెద్దవరం, చెరువుకొమ్ముపాలెం, కొత్తబెల్లంకొండవారిపాలెం గ్రామాల్లో ఎన్ఆర్జీఎస్ నిధులు రూ.35లక్షలతో చేపట్టిన సిమెంట్ రోడ్లు, డ్రైన్ నిర్మాణాలకు ఆదివారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రెక్స్ బయోటెక్స్ కర్మాగారం కొత్తబెల్లంకొండవారిపాలెం గ్రామంలో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావటం అభినందనీయమని పేర్కొన్నారు. నాయకులు ఇంటూరి సీతయ్య, వీరంకి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలి

జిల్లా జడ్జి అరుణసారిక

నందిగామటౌన్: ఖైదీలు సత్ప్రవర్తనతో నడుచుకోవాలని జిల్లా ప్రధానన్యాయమూర్తి అరుణసారిక సూచించారు. స్థానిక సబ్‌జైలును ఆదివారం ఆమె పరిశీలించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలకు అవసరమైతే ఉచిత న్యాయ సలహాలు అందిస్తామని వివరించారు. ఈసదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఖైదీలు ఇబ్బందులను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని వివరించారు. అనంతరం స్థానిక బార్ అసోసియేషన్ హాల్‌లో న్యాయమూర్తి అరుణసారికను న్యాయవాదులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీపీ ఈశ్వరప్రగడ రంగారావు, న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వీరులపాడు: రౌడీషీటర్లు చెడునడత మానుకుని సత్ప్రవర్తనతో నడుచుకోవాలని ఎస్ఐ అనిల్ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్‌లపై నిరంతర నిఘా ఉంటుందని, వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా గ్రామాలలో శాంతిభద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. ముఖ్యంగా సత్ప్రవర్తనతో నడుచుకునేవారిని గుర్తించి రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని వివరించారు.

నేటితో ముగియనున్న ఈకేవైసీ గడువు

జగ్గయ్యపేట: నియోజకవర్గంలో రైతులు ఈకేవైసీ చేయించుకునేందుకు సోమవారమే తుదిగడువు అని జగ్గయ్యపేట ఏడీఏ భవానీ ఆదివారం తెలిపారు. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలలో పంట నమోదు చేయించుకోని రైతులు ఆయా గ్రామాల్లో వ్యవసాయాధికారుల సహకారంతో తప్పకుండా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

ఎక్సైజ్ సీఐ బదిలీ

జగ్గయ్యపేట: సాధారణ బదిలీల్లో భాగం జగ్గయ్యపేట ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి పశ్చిమగోదావరి జిల్లా తణుకు పట్టణానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయవాడ నుంచి బి.గురవయ్య నియమితులయ్యారు. బదిలీపై వెళ్తున్న మణికంఠరెడ్డిని ఆదివారం స్టేషన్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం మణికంఠరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో జగ్గయ్యపేటలో తనకు సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.